

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుముల కొనుగోలు: జేసీ

పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శోభిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రబీలో సాగు చేసిన అపరాల కొనుగోలుకు సంబంధించి పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామన్నారు. క్వింటా మినుముల మద్దతు ధర రూ.7,400గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవ కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. సీఎం యాప్‌లో విధిగా పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

అప్పుడే దాహం కేకలు

జిల్లాలోని పురపాలక, నగర పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. వేసవి ప్రారంభంలోనే 'మన్యం' వాసుల గొంతెండుతోంది. బిందెడు నీటి కోసం పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఎండల తీవ్రతకు తోడు ముందస్తు ప్రణాళిక లేని కారణంగా ప్ర'జల'కు కష్టాలు తప్పడం లేదు. కొళాయిల ద్వారా పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. కొన్నిచోట్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా.. ఏ మాత్రం చాలడం లేదు. మొత్తంగా జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో పరిస్థితేమిటోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



పాలకొండ: గారమ్మకాలనీలో నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

- జిల్లాలో మొదలైన తాగునీటి కష్టాలు
- వేసవి ప్రారంభంలోనే గొంతెండుతున్న వైనం
- కానరాని ముందస్తు ప్రణాళికలు
- అల్లాడిపోతున్న మన్యం వాసులు

పాలకొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి):

పట్టణంలోని 38 వేల మంది జనాభా ఉన్నారు. ఒక్కొక్కరికీ రోజుకు 135 లీటర్ల తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే కేవలం 70 లీటర్లు మా త్రమే సరఫరా చేస్తున్నారు. రోజుకు సరాసరి 5.2 ఎంఎల్‌డి తాగునీరు ప్రజలకు అవసరం కాగా, ప్రస్తుతం ఉన్న రక్షిత పథకాలు ద్వారా 2.44 ఎంఎల్‌డి వరకే అందిస్తున్నారు. పాలకొండలో 2,176 పబ్లిక్ కుళాయిలు ఉండగా 436 ప్రైవేటు ట్యాప్‌లు ఉన్నాయి. 145 వరకు బోర్లు ఉన్నాయి. వీటి ద్వారా అందుతున్న తాగునీరు అంతంతమాత్రమే కావడంతో పట్టణ ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొం టున్నారు. ప్రస్తుతం అందిస్తున్న తాగునీరు కూడా అంత సురక్షితమైనది కాదు. దశాబ్దాల క్రితం వేసిన తాగునీటి పైపులైన్లు ఇప్పటికీ 70 శాతం మురుగునీటి కాలువల్లోనే ఉన్నాయి. ఇవి లీకేలు కావడంతో తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

శివారు ప్రాంతాలకు అందట్లే..

పాలకొండలో శివారు ప్రాంతాలైన గారమ్మ కాలనీ, ఎన్ఎస్ఎన్ కాలనీ, సంపత్‌సాయినగర్, శ్రీని వాసనగర్, ఎన్‌కే రాజపురంతో పాటు పట్టణం నడిబొడ్డున ఉన్న ఎంఎంనగర్, గాయత్రి కాలనీతో పాటు పలు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందడం లేదు. అడపాదడపా నగర పంచాయతీ లోని ఓ ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నప్పటికీ (మిగతా 8వ పేజీలో..)

అరకొరగానే..

సాలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఉయదం వేళ గంట మాత్రమే కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తుండగా.. అవి వారికి ఏ మాత్రం సరిపోవడం లేదు. పట్టణంలో 29 వార్డులున్నాయి. పట్టణ జనాభా సుమారు 70 వేలకు మించి ఉన్నారు. కాగా వారికి పూర్తి స్థాయిలో తాగునీరు అందడం లేదు. మున్సిపాల్టీలో మజ్జుల పేట వద్ద రెండు, గాంధీపార్క్ వద్ద ఒకటి, మక్కువ బైపాస్‌కు వెళ్లే మార్గంలో మరొకటి.. ఇలా నాలుగు రక్షిత నీటి పథకాలు నిర్మించారు. సుమారు 3,700 కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. అయితే 15వ వార్డు పెద్దకుమ్మరి వీధి, బంగారమ్మ కాలనీ, శ్రీనివాసనగర్, పీఎన్ బొడ్డవలస, రామాకాలనీలో కొంతభాగం, కేవీఆర్ రియల్ ఎస్టేట్‌కు సమీపంలో ఉన్న ప్రజలకు పూర్తిస్థాయిలో కుళాయి పాయింట్లు లేవు. దీంతో మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతవాసులకు తాగునీరు అందిస్తున్నారు. మరోవైపు ఉదయం వేళల్లో అరకొరగానే తాగునీరు సరఫరా అవుతుండ డంతో పట్టణ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా.. పట్టణంలో మక్కువ బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న రక్షిత నీటి పథకం మెట్లు శిథిలమై పదేళ్లు గడిచినా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటి వరకు దానిని శుభ్రం కూడా చేయలేదు. దీంతో ప్రజలు ఆ నీటినే తాగాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.



సాలూరులో కుళాయి వద్ద నీటిని పడుతున్న మహిళలు



గుంపుతో సంచరిస్తున్న గున్న ఏనుగు

గుంపులో గున్న ఏనుగు

- పెరిగిన గజరాజుల సంఖ్య

జియ్యమ్మవలస, మార్చి31 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం డివిజన్‌లో సంచరిస్తున్న గజరాజుల సంఖ్య పెరిగింది. ఇటీవల జన్మించిన గున్న ఏనుగుతో కలిసి వాటి సంఖ్య ఏనిమిదికి చేరింది. కాగా ఐదు రోజుల కిందట జన్మించిన గున్న ఏనుగుకు జూనియర్ హరి అని అటవీ శాఖాధికారులు నామకరణం చేశారు. దానిని చూసేందుకు ఎవరూ వెళ్లొద్దని వారు సూచిస్తున్నారు. సోమవారం ఏనుగుల గుంపు కన్నపుదొరవలస పంచాయతీ పరిధిలో సంచరిస్తుండడంతో ఆ ప్రాంతవాసులను అప్రమత్తం చేశారు. గత కొద్ది నెలలుగా కనిపించకుండా పోయిన ఒంటరి ఏనుగు ఒడిశాకు వెళ్లిపోయిందని చెబుతున్నారు. కాగా భామినిలో ప్రాంతంలో నాలుగు గజరాజులు సంచరిస్తుండగా జిల్లాలో మొత్తం ఏనుగుల సంఖ్య 12కు చేరిందని అటవీశాఖాధికారులు తెలిపారు.

రేషన్‌కార్డుల ఈకేవైసీకి గడువు పెంపు

- ఈనెల 30 వరకు అవకాశం
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

జియ్యమ్మవలస, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల ఈకేవైసీ గడువును పెంచింది. ఈ నెల 30 వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవగా గతనెల 31లోగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఆదేశించింది. కానీ పెండింగ్ కార్డుదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో గడువును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లోగా ఈకేవైసీ పూర్తి చేసుకోకుంటే మే నుంచి రేషన్ అందే అవకాశం లేదని తేల్చి చెప్పింది. నకిలీ రేషన్ కార్డులను తొలగించి అర్హులకు మాత్రమే సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సివిల్ సప్లైస్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

ఇదీ పరిస్థితి

- జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 15 మండలాలు, 451 పంచాయతీలు, 2,282 గ్రామాలు ఉన్నాయి. మొత్తంగా 55,104 అంత్యోదయ కార్డులు, 2,22,049 తెలుపు రేషన్‌కార్డులు ఉన్నాయి. జిల్లాలో 8 మండల లెవెల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లు ఉన్నాయి. వీటి ద్వారా పాలకొండ డివిజన్‌లో 259 ఫెయిర్ ప్రైస్ (ఎఫ్‌పీ) షాపులు, పార్వతీపురం డివిజన్‌లో 319 ఎఫ్‌పీ షాపులు , 101 డీఆర్ డిపోలు ఉన్నాయి. 196 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతినెలా కార్డుదారులకు సరుకులు అందిస్తున్నారు.
- జిల్లాలో 2,77,153 రేషన్‌కార్డుల్లో 8,16,859 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఇంతవరకు 7,35,287 మందికి ఈకేవైసీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. ఇంకా 81,572 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది.

ఇవీ ఇబ్బందులు

- ఈకేవైసీని రేషన్ డీలర్లు, సేల్స్‌మెన్ చేస్తుండగా.. ఐదేళ్లలోపు పిల్లలకు వేలి ముద్రలు పడటం చాలా కష్టమవుతోంది.
- గిరిజన ప్రాంతాల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు. వీరికి ఈకేవైసీ చేసే అవకాశం సేల్స్‌మెన్‌కు లేకపోతోంది.
- వృద్ధులకు ఇంటి వద్ద ఉంచేసి జిల్లాలో ఎంతో మంది వలస వెళ్లిపోయారు. వారికి ఫోన్ చేసి రమ్మన్నా వచ్చే అవకాశాలు తక్కువ.



జియ్యమ్మవలసలో కార్డుదారులకు ఈకేవైసీ చేస్తున్న దృశ్యం

ఆఫ్‌లైన్ షాపుల పరిస్థితేంటి..?

జిల్లాలో మొత్తం 60 ఆఫ్‌లైన్ షాపులు ఉన్నాయి. ఇవన్నీ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో ఉన్నవే. (మిగతా 8వ పేజీలో...)

స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం

సాలూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సాలూరులో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ బి.ప్రమీలకు సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీమంతం చేశారు. ఏఎస్పీ అంకిత సురాన ఆమెకు పసుపు, కుంకుమ, చీర ఇచ్చి కార్యక్రమం జరిపించారు. దీంతో ప్రమీల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న దృశ్యం

హత్యచేసి.. చెట్టుకు ఉరేసి..

- ప్రియురాలిని కడతేర్చి.. ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం
- మృతదేహాన్ని బైక్‌పై సాలూరు మండలానికి తీసుకొచ్చిన వైనం
- చివరకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుబడిన నిందితుడు
- 48 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు

సాలూరు, మార్చి31(ఆంధ్రజ్యోతి): ప్రియురాలిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరించాడు.. అందరి కళ్లు గప్పి తప్పించు కోవాలని యత్నించాడు.. చివరకు పోలీసులకు పట్టు బడ్డాడు. గతనెల 28న సాలూరు మండలంలో అనుమానాస్పద స్థితిలో మరణించిన గిరిజన యువతి కేసును పోలీసులు ఛేదించారు. చాకచక్యంగా వ్యవహరించి 48 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్నారు. దీనికి సంబంధించి సోమవారం సాలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ అంకిత సురాన తెలిపిన వివరాల ప్రకారం..

సాలూరు మండలం కందులపథం పంచాయతీ మర్రివానివలసకు చెందిన వాటిక ఐశ్వర్య (20) విశాఖపట్నంలోని ఓ చోట పనిచేస్తోంది. అక్కడే ప్రైవేట్ జాబ్ చేస్తున్న కరాసువలస పంచాయతీ దత్తివలసకి చెందిన పెరుమాళ్ల రాంబాబుతో కొద్ది నెలల కిందట పరిచయమైంది. ఇద్దరిదీ ఒకే మండలం కావడంతో స్నేహం కాస్త ప్రేమగా మారింది. రాంబాబు వివాహితుడు అయినప్పటికీ తనను పెళ్లిచేసుకోవాలని ఐశ్వర్య తరచూ అడుగుతుండేది. రాంబాబు మాత్రం ఈ విషయాన్ని కొద్దిరోజులుగా దాటవేస్తూ వస్తున్నాడు. కాగా గతనెల 23న స్వగ్రామాలకు వచ్చిన వారు 26న శంబర డ్యామ్ వద్ద కలుసుకున్నారు. తనను పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య గట్టిగా రాంబాబును అడిగింది. దీంతో వారు విశాఖలోనే ఉండి సహజీవనం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం గత నెల 27న ఐశ్వర్య రాంబాబు బైక్‌పై విశాఖకు వెళ్లింది. అదే రోజు ఆరిలోవ ఏరియా, పైనాపిల్ కాలనీ, హుద్‌హుద్ షెల్టర్ ఎస్ఎఫ్3లో వివాహ విషయమై వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో రాంబాబు ఆమె మెడను తాడుతో బిగించి హతమార్చాడు. అనంతరం సమీపంలో ఉన్న ఆసుపత్రికి 108 సహాయంతో తీసుకెళ్లాడు. అక్కడ తనిఖీ చేసిన వైద్యులు యువతి మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో రాంబాబు తన స్నేహితుడికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. బైక్‌పైనే ఐశ్వర్య మృతదేహంతో వారు సాలూరు మండలం చీపురువలస వరకు పయనమయ్యారు. మార్గ మధ్యలో మానాపురం రైల్వే ట్రాక్ సమీపంలో పెట్రోల్ అయిపోవడంతో బైక్ ఆగిపోయింది. దీంతో వారు మరో స్నేహితుడికి ఫోన్ చేసి పెట్రోల్ తెమ్మని చెప్పారు. ఆ వ్యక్తి కూడా బైక్‌పై వచ్చి రాంబాబు ప్లాన్‌కు సహకరించాడు. మొత్తంగా బైక్‌లపై వారు ముగ్గురు సాలూరు మండలం వరకు వచ్చారు. చీపురువలస సమీపంలో ఉన్న జీడితోటల్లోకి ఐశ్వర్య మృతదేహాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఆ యువతి ఉరివేసుకున్నట్లుగా చిత్రీకరించి వారు తిరుగు ప్రయాణమయ్యారు. స్థానికుల సమాచారం మేరకు గత నెల 28న జీడితోటల్లో గిరిజన యువతి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన దర్యాప్తు వేగవంతం చేశారు. సెల్‌ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు. రాంబాబుకు సహకరించిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్పీ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన సాలూరు పట్టణ, రూరల్ సీఐలు, ఎస్ఐలను ఆమె అభినందించారు.



ఐశ్వర్య (ఫైల్)



కేసు వివరాలు చెబుతున్న ఏఎస్పీ అంకిత సురాన

నేడు పోలమాంబ పదో వారం జాతర

- మహాచండీ హోమానికి ఏర్పాట్లు

మక్కువ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉత్త రాంధ్రుల ఆరాధ్యదేవత, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ పదో వారం జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. జాతర ఆఖరి వారం సందర్భంగా మహా చండీ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ పూజల్లో పాల్గొనున్నారని వెల్లడించారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. హోమం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున అమ్మవారి దర్శనం వేగవంతమయ్యేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.



పక్కాగా నీటి నాణ్యతా పరీక్షలు: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో చేపడు తున్న నీటి నాణ్యతా పరీక్షలు పక్కాగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. రెండు శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని, ఎప్పటిక ప్పుడు నీటి పరీక్షలు చేపట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో చేపట్టే 14 రకాల వాటర్ టెస్ట్‌లను రోజూ పర్యవేక్షించి.. తమకు నివే దికలు అందజేయాలని ఆదేశించారు. బయోలాజికల్ కంటెంట్, క్లోరిన్ లెవెల్ టెస్ట్‌లను ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా నమోదైన పాజిటివ్ అంశాలను అడిగి తెలుసు కున్నారు. నాణ్యతా ప్రమాణాలు సరిగా లేకపోతే ఏం చేయాలనే దానిపై దృష్టిసారించాలన్నారు. వేసవిలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. రోజు రోజుకూ ఎండలు తీవ్రమ వుతున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

నీటితొట్టెల నిర్మాణాలు ప్రారంభించాలి

జిల్లాలో పశువుల కోసం 411 నీటి తొట్టెలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వాటి నిర్మాణాల ప్రక్రియలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం సూచించారు. మండలాల్లో తాగునీటి సమస్యలపై తక్షణమే స్పందించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మండ లాల్లో ప్రత్యేక సెల్ నిర్వహించాలని, 24 గంటల్లో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

డోలీ మోతలు లేకుండా చేయడమే లక్ష్యం

- మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సిమిడివలసలో గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

8లో

మూగ రోదన

● నెల రోజుల్లో పదుల సంఖ్యలో పశువుల మృతి

● ఆందోళన చెందుతున్న పాడి రైతులు

వంగర, మార్చి31 (ఆంధ్రజ్యోతి): పాడిని జీవనాధారంగా మలుచుకున్న లక్ష్మీపేట ప్రజలకు పెద్దకష్టమొచ్చింది. గొంతు వ్యాధి సోకి బర్రెలు, దూడలు గంటల వ్యవధిలో చనిపోతున్నాయి. పశుసంపదనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులు అయోమయంలో కొట్టిమిట్టాడుతున్నారు. మూగ జీవాలను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. పశువైద్యాధికారులు శిబిరాలు ఏర్పాటు చేశామని, కారణాలు అన్వేషిస్తున్నామని చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని రైతులు వాపోతున్నారు. రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొందని, తాజాగా సోమవారం రెండు దూడలు మృతి చెందాయని రైతులు తెలిపారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

లక్ష్మీపేటలో మృతి చెందుతున్న తక్కువ వయస్సు ఉన్న దూడలకు సూమారు 100 డిగ్రీలు పైగా తీవ్ర జ్వరంతో శ్వాస పీల్చుకోవటం కష్టమై గొంతు కింద మెడ దగ్గర వాపు వస్తోంది. దీనివల్ల పశువులు ఇబ్బందులు పడుతున్నాయని రైతులు తెలిపారు. నోటి నుంచి జలం ఎక్కువగా కారుతోందని, దాంతో పశువులు నీరసించి రెండురోజుల్లో మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

ముందస్తు టీకాలేవీ..?

ముందస్తుగా టీకాలు వేస్తే పశువులు మృతి చెందేవి కావని ఆధికారుల తీరును రైతులు తప్పుపడుతున్నారు. సాధారణంగా పశువుల్లో సోకే గాలికుంటు, గొంతువాపు వ్యాధికి అక్టోబరు, నవంబరు నెలల్లో టీకాలు వేయాల్సి ఉన్నప్పటికీ పరిస్థితి చేజారిన తరువాత వైద్యులు మేల్కొన్నారని రైతులు అంటున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా పశువులకు నష్టం వాటిల్లిందనేది వారి మాట.

లెక్కల్లో పొంతన ఏదీ..

గ్రామంలో రెండు నెలల్లో దాదాపు 28 వరకు పశువులు మృత్యువాత పడినట్లుగా రైతులు చెబుతుండగా మరో 12 దూడలు మృతి చెందాయిన రైతులు చెబుతుంటే.. అధికారులు మాత్రం ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను గుర్తించామని చెబుతున్నారు.

పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం

పశువులకు వ్యాధి సోకిన మాట వాస్తవమే. లక్ష్మీపేటలో పలు దఫాలుగా వైద్య శిబిరాలు నిర్వహించాం. సకాలంలో టీకాలు వేశాం. పశువులు మడ్డువలస రిజర్వాయర్ సమీపానికి మేతకు వెళ్లటంతో అక్కడ గడ్డిపై చేరిన జలగల ద్వారా వ్యాధి వ్యాపిస్తోంది. గడ్డితో పాటు పశువులు జలగలను తినటంతో అవి కడుపులో వృద్ధి చెంది ఇలా మృత్యువాత పడుతున్నాయి.

-ప్రవీణ్, పశు వైద్యుడు, మద్దివలస సచివాలయం



వ్యాధి సోకిన దూడ



సీఎంతో మాట్లాడుతున్న కళావెంకటరావు

చంద్రబాబును కలిసిన కళా

రాజాం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) మంగళగిరి లోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ముఖ్య మంత్రి చంద్రబాబును ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మ ర్యాద పూర్వకంగా కలిశారు. చీపురుపల్లి నియో జకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముస్లిం సంక్షేమానికి కృషి

రాజాం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు సోమవారం ఆ యన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్ర స్తుత ప్రభుత్వ హయాంలోనే ముస్లిం మైనార్టీ లకు సంక్షేమం అందుతోందన్నారు. మౌజం, ఇమామ్‌లకు నిలచిపోయిన గౌరవ వేతనం ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇస్తా మని మాట ఇచ్చి నిలబెట్టుకుందన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అలమండ

కొత్తవలస, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఉగా ది సందర్భంగా కొత్తవలస పంచాయతీ 202 కా లనీ సమీపంలోని సుమారు 20 రోజులుగా నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 60 జట్లు పాల్గొన్నాయి. జామి మండ లం అలమండ జట్టు ప్రథమ స్థానం, పుణ్యగిరి జట్టు ద్వితీయ స్థానం, గెడ్డపేట జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఆది వారం సాయంత్రం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతుల మీదుగా నిర్వాహకులు నగదు బహుమ తులను ప్రదానం చేశారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ

శృంగవరపుకోట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఉ గాది, రంజాన్ సందర్భంగా బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా జరిగిన పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయని కోచ్ శ్రీరాములు తెలిపారు.

ఘనంగా నవమి వేడుకలు ప్రారంభం

లక్కవరపుకోట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురంలో సోమవారం శ్రీరా మనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యా యి. శ్రీరామ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వారి ఉత్స వ విగ్రహాలను గోమాతతో కలిసి గ్రామంలో ఊరేగించారు.

రక్తనిధికి రూ.76 లక్షల విలువైన పరికరాలు

విజయనగరం రూరల్, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): విజయనగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త నిధి కేంద్రం పునరుద్ధరణకు అవసరమైన పరి కరా లను పవర్‌గ్రిడ్ సౌతరన్ ఇంటర్ కనెక్షన్, ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ లిమిటెడ్ కంపెనీ కొను గోలు చేశాయి. ఇందుకుగానూ రూ.76 లక్షలు వె చ్చించాయి. సోమవారం నిర్వహించిన కార్యక్ర మంలో రక్తనిధి కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి కొం డపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు.

అదుపు తప్పిన ఆటో: ముగ్గురికి గాయాలు

మెంటాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక హరిత రహదారి వద్ద సోమవారం ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆటోలో నలుగురు ప్రయాణిస్తుండగా మెంటాడ గ్రామానికి చెందిన పాండ్రంకి గౌరినాయుడు, తాట్రాజ్ శ్యామ్‌గణేష్, సిరిపురం మదన్‌లకు గాయాలయ్యాయి. క్షతగా త్రులకు మెంటాడ పీహెచ్‌సీలో చికిత్స అందిం చిన అనంతరం గజపతినగరం ఏరియా ఆసుప త్రికి తరలించారు. గౌరినాయుడు విజయ నగరం ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు.

నేడు పింఛన్ల పంపిణీ

విజయనగరం రూరల్, మార్చి 31 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మండలం లోని కొండకరకాం, నగర పరిధిలోని 14 వ డివిజన్ చెరువుగట్టు, 13వ డివిజన్ పరిధిలోని బంగారమ్మ చదురు లైన్‌లో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేపట్టనున్నారు.

అచ్చెన్నను కలిసిన శిష్టకరణాలు



వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

రాజాం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును రాజాం, శ్రీకాకుళం, విశాఖకు చెందిన చెందిన పలువురు శిష్టకరణ సంఘ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి త్వరలో భర్తీ చేయనున్న కార్పొరేషన్ల చైర్మన్లలలో శిష్టకరణ కార్పొరేషన్ చైర్మన్ పదవిని రాజాంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఉరిటి సురేంద్రకుమార్‌కు ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. సురేంద్ర తండ్రి సాంబమూర్తి పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారన్నారు. నాలుగు దశాబ్దాలుగా రాజాం ప్రాంతంలో పార్టీకి విశిష్టమైన సేవలు అందించారని వారంతా అచ్చెన్నాయుడికి వివరించారు. మంత్రి అచ్చెన్నను కలిసిన వారిలో పక్కి వాసు, రాజాం అప్పలనరసయ్య, శ్రీనివాసరావు, కుప్పిలి సాయి, రాజేశ్, కూరాడ పావని తదితరులున్నారు.

ఫిట్‌నెస్ కేంద్రాన్ని నిలుపుదల చేయండి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలని విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు కోరారు. సోమవారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును జిల్లా కేంద్రంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖలో అవినీతిని నిర్మూలించేందుకు అవినీతి లేని విధానంలో సేవలు అందించడానికి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వాహన ఫిట్‌నెస్ కేంద్రాలను అప్పగించిందన్నారు. కానీ అందుకు విరుద్ధంగా ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌లో వ్యవహారం సాగుతోందని ఫిర్యాదు చేశారు. రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ సెంటర్ కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ త్వరలో రవాణాశాఖ ఉపకమిషనర్‌తో మాట్లాడి, సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతామన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీని నగరంలో మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని వైసీపీ మహిళా నాయకులు పెనుమత్స జ్యోతి, కిరణ్ జ్యోతిర్మయి, సంధ్య, లక్ష్మి, షాలినితో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు ఎమ్మెల్యే అదితి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నగర నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, విజ్జపు ప్రసాద్, కంది మురళీనాయుడు, పిళ్లా విజయ్‌కుమార్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీవిత సాఫల్య పురస్కారాల ప్రదానం

విజయనగరం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నేపథ్య గాయనీ, ఎస్.పి.శైలజ, సినీ నటుడు శుభలేఖ సుధాకర్‌లకు గురునారాయణ కళా పీఠం జీవిత సాఫల్య పురస్కారం అందజేయనుంది. మంగళవారం మధ్యా హ్నం 4 గంటలకు విజయనగరం పట్టణంలోని ఆనందగజపతి కళాక్షేత్రంలో కళా పీఠం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని వారికి రపదానం చేయ నున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గాయనీ, పద్మభూషణ్, గాన కోకిల పి.సుశీల పాల్గొంటారు.

లేగ దూడల పెంపకం అవసరం



రైతుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాడి పశు వుల అభివృద్ధికి లేగదూడలు చాలా కీలకమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని మర్లాపల్లిలో సోమవారం లేగదూడల ప్రదర్శన జిల్లా పశుగణాభివృద్ధి శాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. భవిష్యత్ తరాలకు పాలను అందించాలంటే పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాల్సిందేనన్నారు. ఈ సంద ర్భంగా 78 మంది రైతులు 90 లేగ దూడలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరావు, జేడీ వై.వి.రమణ, ఏడీ గంగాధర్, పశు వైద్యులు కె.గాయత్రి, ఎస్.సత్యనారాయణ, సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.

అవయవదాతలకు మరణం లేదు



సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం, రింగురోడ్డు మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అవయవదాతలకు మరణం లేదని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మదర్ థెరీసా క్లబ్‌లో అవయవదాతల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలు వల్ల ఎవరైనా మరణిస్తే, అవయవాలను మరొకరికి ఇస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. అవయవ దాతలను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ అవయవాలు దానం చేయడం ఒక బృహత్తరమైన కార్యక్రమమన్నారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు, అఖిల భారత అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టరు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అవయవదానం చేసేవారికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేసిన పాచిపెంట మండలం లంకేన సాయి, గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గండి సాయిపల్లవి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిళ్లా విజయ్‌కుమార్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు ఎంవీఆర్ కృష్ణాజీ, ఎరుకొండ ఆనంద్, శివాజీ, గంద్రేటి లక్ష్మణరావు, జి.భవానీ, డప్పు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోండి



విజేతలతో వాజీ చానల్ యాజమాన్యం

విజయనగరం రింగురోడ్డు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంలో వాజీ చానల్ ఎల్లప్పుడూ ముందుండడం అభినందనీయమని ఎఆర్ఎస్‌పీజీ నాగేశ్వరరావు అన్నారు. నగరంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రవ్వా శ్రీనివాసరావులతో కలిసి ఇంటర్నెట్ ప్రోటోకాల్ టీవీని సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది హౌసీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వాజీ చానల్ మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని అకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్రీడా పోటీలు, మహిళలక రంగోలి పోటీలు, హౌసీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాజీ చానల్ 30 ఏళ్ల నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రేక్షకాదరణ పొందుతోందన్నారు. ఇంటర్నెట్ ప్రోటోకాల్ టీవీ ద్వారా ప్రేక్షకులకు సెటప్ బాక్స్ లేకుండానే ఇంటర్నెట్ ద్వారా ప్రసారాలు అందజేసేందుకు ముందుకు వస్తున్నామన్నారు. ఐపీ టీవీ ద్వారా ఓటీసీ ఛానల్స్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాజీ సిబ్బంది, కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సెంచూరియన్‌లో ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ సమావేశాలు



మాట్లాడుతున్న ఫాల్గుణరావు

పర్లాకిమిడి,మార్చి31(ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి సమీపంలో గల రాజ్‌సీతాపురం వద్ద గల సెంచూరియన్ యూనివర్సిటీలో మంగళవారం నుంచి ఈనెల ఐదో తేదీ వరకూ మూడో ఏఐయూ నేషనల్ ఉమెన్ స్టూడెంట్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ విశ్వవిద్యాలయ అడ్మిషన్ జనరల్ మేనేజర్ ఎస్.ఫాల్గుణరావు తెలిపారు. ఎంపవరింగ్ వాయిసెస్-షేపింగ్ ఫ్యూచర్స్ ఆఫ్ వికసిత్ భారత్ థీమ్‌తో కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. మహిళల సామర్థ్యం పెంపు, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఆంధ్ర, ఒడిశాలకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మిద్దె పంటలు మేలు

విజయనగరం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతాల్లో బాల్కనీ, మిద్దెల వద్ద పంటలు వేయడం మేలు అని నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లన య్య చెప్పారు. టెర్రస్ గార్డెన్ పేరిట ఏర్పాటు చేసిన గ్రూప్ ప్రత్యేకంగా ఎన్‌సీఎస్ రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ పంటలను రసాయనాలతో కాకుండా ఇంట్లో వచ్చే వ్యర్థాలతో ఎరువును తయారు చేసి ఉపయో గించాలన్నారు. మొక్కలు పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తాయన్నారు. హౌసింగు పీడీ మురళీ మాట్లాడుతూ కాలుష్యం ఒక వైపు, మరోవైపు భూగర్భ జలాలు అడుగింటుతున్న ఈ సమయంలో వీటి పరిరక్షణకు కృషి చేసి భవిష్యత్ తరాలకు మేలు చేయాలన్నారు. మిద్దె పంటలు వల్ల ఎంతో ప్రయోజనం ఉం దన్నారు. గ్రూప్ విజయనగరం నిర్వాహకురాలు లలితా శ్రీనివాస్ మాట్లాడుతూ మిద్దె పంటలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇంట్లో లభించే తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంట్లో కావలసిన ఆకుకూరలు, కాయగూరలను ప్రోత్సహిస్తున్నామ న్నారు. ఎంతో మందిని గ్రూప్‌లో సభ్యులుగా చేర్చి, రానున్న కాలంలో మిద్దె పంట లను ప్రోత్సాహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస రావుతో పాటు టెర్రస్ గార్డెన్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పారదర్శక సేవలు

● రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ నాగలక్ష్మి

విజయనగరం దాసన్నపేట మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రిజిస్ట్రేషన్ కార్యాలయా ల్లో పారదర్శకమైన సేవలను అందించేందుకు డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా స్లాట్ బుకింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ నాగలక్ష్మి అన్నారు. సోమవారం దాసన్నపేటలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్‌పై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి దాసన్నపేటలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుం దన్నారు. ప్రజలు ముందే వారి అపాయింట్‌మెంట్ తేదీ, సమయాన్ని బుక్ చేసుకోవచ్చన్నారు. దీంతో క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు, అమ్మకందారులు, సాక్షులు తమ కార్యాలయ పర్యటనను ముందుగానే ప్రణాళికతో నిర్వహించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ పక్రియ సమయ పాలనతో పాటు, క్రమబద్ధంగా మారుతుందన్నారు. మధ్యవర్తుల ప్రభావం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఎ.వి.కుమారి, సబ్ రిజిస్ట్రార్లు ప్రసాదరావు, కె.ఎ.శీల పాల్గొన్నారు.



స్లాట్ బుకింగ్‌పై అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

భీమిలి బీచ్‌లో మరుపల్లి వాసి మృతి

గజపతినగరం, మార్చి31 (ఆంధ్రజ్యోతి: మండలంలోని మరుపల్లి గ్రామా నికి చెందిన గెద్ద పరదేశి (34) భీమిలి బీచ్‌లో ఈతకు వెళ్లి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. మరుపల్లి గ్రామానికి చెందిన పరదేశి స్టేట్‌బ్యాంక్ వ ద్ద కౌసిక్ బ్యాంకింగ్‌లో విధులు చేపట్టడంతో పాటు సొంత గ్రామంలో డె యిరీ నిర్వహిస్తున్నాడు. సోమవారం తన స్నేహితులతో కలిసి భీమిలి బీచ్ కు వెళ్లారు. సరదాగా ఈతకు వెళ్లిన పరదేశి మృత్యువాత పడ్డారు. దీంతో త న స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య నిర్మల, రిషిత, లోకేశ్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు గెద్ద రామారావు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో గొర్రెల కాపరి..

జామి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వారాధి అప్పలకృష్ణ(44) జాగరం గెడ్డలో పడి అనుమానాస్పద స్థితి లో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలకృష్ణ ఆది వారం ఒక మహిళ చనిపోవడంతో ఆమె అంత్యక్రియలకు వెళ్లి వచ్చాడు. అ నంతరం గొర్రెల మేపునకు వెళ్లిపోయాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం మొదలుపెట్టారు. అయితే జాగరం గెడ్డలో ఒక వ్యక్తి చనిపోయి మృతదేహం తేలిందని తెలియడంతో అక్కడకు వెళ్లి చూశారు. అది అప్పలకృష్ణగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఎటు వంటి ఇబ్బందులు లేని కృష్ణ మరణం పలు అనుమానాలకు దారితీసింది. భార్య గౌరి మాత్రం తన భర్త ప్రమాదవశాత్తు గెడ్డలో పడి చనిపోయినట్టు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

సీతానగరం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడివరం సమీపంలో సోమ వారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అరుణ్ బెహరా(40) సీతానగరం నుంచి బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య గుమ్మడివరం సమీపంలో రైలు నుంచి జారిపడిపోయాడు. గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే పోలీస్ హెడ్ కాని స్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..

పాలకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో ఉగాది రోజున ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పాల కొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన మీసాల తిరుపతిరావు(39) ఆది వారం వీరఘట్టం వెళ్లాడు. పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై తి రిగి వస్తుండగా వీరఘట్టం మండలం తూడి జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తిరుపతిరావును తొలుత పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకా కుళంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర ్ధరాత్రి మృతి చెందాడు. తిరుపతిరావుకు భార్య సరస్వతి, కుమారులు హర్ష వర్ధన్, సుధీర్ ఉన్నారు. ఘటనపై వీరఘట్టం ఎస్ఐ జి.కళానిధి కేసు నమోదు చేశారు.

ఎస్ఐని సస్పెండ్ చేయాలి



సీఐతో మాట్లాడుతున్న బాధితులు

వేపాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిని తక్షణమే సస్పెండ్ చేయాలని మండలంలోని బానాది శివారు ఎం.సింగవరం గ్రామానికి చెందిన షైచర్ల అప్పన్నదొర, షైచర్ల జయమ్మ, భారతి సోమవారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ ఎస్ఐ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నారని ఆరోపించారు. ఎస్పీ, డీఎస్పీ, సీఐలకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఎటువంటి చర్యలు లేవన్నారు. బాధితుల ఆందోళనతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎల్.కోట ఎస్ఐ నవీన్‌పడాల్ బాధితులతో మాట్లాడారు. తుదకు వెలుగు కార్యాలయం వద్ద బాధితులు, గ్రామస్థులతో సీఐ అప్పలనాయుడు మాట్లాడారు. డీఎస్పీతో మాట్లాడి ఎస్ఐ దేవిని దర్యాప్తు నుంచి తప్పిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో బానాది సర్పంచ్ కర్రి యశోద, ఉపసర్పంచ్ కోట్ని కృష్ణ వల్లంపూడి ఉపసర్పంచ్ రుద్ర వెంకటరావు, కర్రి పెదనాయుడు, పాల సంఘం అధ్యక్షుడు గళ్ల రామచంద్రుడు, గళ్ల రాము, దుడ్డు తాతారావు, గళ్ల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రెల్లి కులస్థులకు న్యాయం చేయండి



అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డుల ప్రదర్శన

విజయనగరం దాసన్నపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రెల్లి కులస్థులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని రెల్లికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శ్రీను, వై.రము డిమాండ్ చేశారు. రెల్లి కులస్థులకు విద్యారంగంలో రిజర్వేషన్లపై జరిగిన అన్యాయంపై నిరసిస్తూ సోమవారం అంబేద్కర్ జంక్షన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు, చిన్నారులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఆది నుంచి రెల్లికులస్థులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణలో తీవ్ర అన్యాయానికి గురి చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణ, దుర్గారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుపై నిరసన



మానవహారం నిర్వహిస్తున్న ముస్లింలు

రాజాం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజాం జామియా మసీదు పరిధిలోని ముసిం సోదరులు వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలో శాంతియుతంగా మానవహారం నిర్వహించారు. మసీద్ నుంచి ర్యాలీగా వెళ్లి బొబ్బిలి రోడ్డు కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో జామియా మసీదు జమాత్ సభ్యులు ఇనా నటు వట్టి, ఎస్‌కె ఇమామ్ ముద్దీన్, ఎస్‌కె మోహిద్దీన్, ఎస్‌కె బాషా, ఎస్‌కె మదీనా, ఎస్‌కె హుస్సేన్, ఎస్‌కె అబ్దుల్ రెహమాన్, ఎస్‌కె కసీమ్ తదితరులు పాల్గొన్నారు

గుండెపోటుతో బడేవలస సర్పంచ్ మృతి

మెంటాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడేవలస సర్పంచ్ మీసాల పార్వతి (45) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. కుటుం బ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె తుదిశ్వాస విడిచారు. సర్పంచ్ మృతిపై వైసీపీ నేతలు సంతాపం తెలిపారు.

పెందుర్తి-బొడ్డవర రోడ్డు విస్తరణకు సర్వే

శృంగవరపుకోట రూరల్ మార్చి 31 : మండలంలోని విశాఖ-అరుకు రోడ్డు విస్తరణకు సంబంధించిన సర్వేను ఎస్.కోట-బొడ్డవర మార్గంలో సోమవారం సర్వే చేశారు. ఇందులో భాగంగా రోడ్డు మధ్య నుంచి 20 నుంచి 25 అడు గుల మేర కొలతలు వేసి హద్దులు గుర్తించారు. ఇళ్లపై మార్కింగ్ చేపడు తుండటంతో స్థానికులు భయపడుతున్నారు.

రేషన్‌కార్డుల ఈకేవైసీకి గడువు పెంపు

(ఐదో పేజీ తరువాయి)

అయితే ఇక్కడ కూడా ఈకేవైసీ చేయాలంటే ఇబ్బందులు తప్పేటట్లు లేదు. వీరందరికీ ఈకేవైసీ చేయాలంటే కచ్చితంగా ఆయా ప్రాంతాల్లో సిగ్నల్స్ ఉన్న చోటుకు ప్రజలు రావల్సిందే. కొన్ని ప్రాంతాల్లో అయితే కిలో మీటర్ల కొద్ది కాలినడకన రావల్సిన పరిస్థితి ఉంది. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

పూర్తి చేస్తాం

ఈకేవైసీ విషయంలో ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు ఇచ్చింది. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈకేవైసీ పూర్తి చేస్తాం. దీనిపై డిపో డీలర్లు, సేల్స్‌మెన్ ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశాలిచ్చాం.

- ఐ.రాజేశ్వరి, ఇన్‌చార్జి డీఎం, జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ, పార్వతీపురం మన్యం

అప్పుడే దాహం కేకలు

(ఐదో పేజీ తరువాయి)

వారికి పూర్తిస్థాయిలో అందడం లేదు. దీంతో ఆయా కాలనీవాసులు అందుబాటులో ఉన్న వాటర్‌ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

వెనక్కి మళ్లిన నిధులు..

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2014-19లో నాన్ అమృత్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.57 కోట్లు కేటాయించారు. అయితే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హడావుడిగా పనులు ప్రారంభించింది. 20 వార్డులకు గాను ఆరు వార్డుల్లో రోడ్లు తవ్వి పైపులైన్లు వేశారు. జగన్నాథస్వామి గుడి వద్ద ఎన్‌కేరాజపురం, ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంగణాల్లో రక్షిత నీటి పథకాలకు ప్రణాళికలు రూపొందించారు. కానీ పనులు సకాలంలో చేపట్టకపోవడంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. మొత్తంగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. పట్టణ ప్రజలకు శాపంగా మారింది. నేటికీ ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

నిరీక్షించాల్సి వస్తోంది..

మా కాలనీకి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. బిందెడు నీటి కోసం కుళాయి గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. దీనిపై అధికారులు స్పందించాలి.

-కె.రమణమ్మ, గారమ్మకాలనీ, పాలకొండ

వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా..

వేసవి దృష్ట్యా పట్టణంలోని శివారు ప్రాంతాల్లో కాలనీలకు రెండు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రజల కష్టాలు తీరుస్తాం.

- టి.జయరాం, నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్, పాలకొండ

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌కు భానుప్రసాద్



భానుప్రసాద్‌ను అభినందిస్తున్న దుర్గాప్రసాద్

దత్తిరాజేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన దీసరి భానుప్రసాద్ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విశాఖలో ఇటీవల జరిగిన పోటీల్లో 200 కిలోల విభాగంలో భానుప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి ఏప్రిల్ నెలలో నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా భానుప్రసాద్‌ను అదే గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు మామిడి దుర్గాప్రసాద్ అభినందించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కోమటిపల్లి గ్రామ యువకులు పాల్గొన్నారు.

పాలీట్రీస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

చీపురుపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వెంకటరామ పాలీట్రీస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని చీపురుపల్లిలో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సీపీఎం జిల్లా కార్యదర్శి టీవీ రమణ, సీఐటీయూ ప్రతినిధి అంబల్ల గౌరునాయుడు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ చీపురుపల్లి మండలంలోని కర్లాం వద్ద ఉన్న వెంకటరామ పాలీట్రీస్ యాజమాన్యం చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. 2011లో ఇక్కడ ఏర్పాటైన సంస్థ గత 6 ఏళ్లుగా పనిచేస్తున్న స్థానికులను తొలగించి, ఇతర రాష్ట్రాలకు చెందిన వారితో పనులు చేయిస్తోందన్నారు. దశల వారీగా స్థానికులందరినీ తొలగించాలనేది వారి కుట్ర చేస్తున్నారన్నారు. సమావేశంలో కార్మిక సంఘ ప్రతినిధులు గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

'ఎస్ఐని విధుల నుంచి తప్పించండి'

వేపాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిని విధుల నుంచి తప్పించాలని ఏపీ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవా ది గాలి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వేపాడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐపై నమోదై న అట్రాసిటీ కేసుపై పక్కాగా దర్యాప్తు చేపట్టాలన్నారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు నాయకుడు దేబారికి కిరణ్, పి.స్వామినాయుడు పాల్గొన్నారు.

16 మార్టుగేజ్ రిజిస్ట్రేషన్లు పూర్తి

రాజాం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 16 మార్టుగేజ్‌లు రిజిస్ట్రేషన్లు చేసినట్టు రిజిస్ట్రార్ కె.వేణు తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంకాలం 5 గంటల వరకు కార్యాలయం తెరిచి ఉన్నప్పటికీ ఈ భూక్రయ, విక్రయదారులు ఎవరు రాలేదు. ఏటా ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో రెండురోజుల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడుతుంటాయి. జిల్లాలో విజయనగరం పశ్చిమ, విజయనగరం ఆర్వో, కొత్తవలస, భోగాపురం, ఎస్.కోట గజపతినగరం, నెల్లిమర్ల, బొబ్బిలి, తెర్లాం, రాజాం, చీపురుపల్లిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. రోజుకు సగటున జిల్లాలో 200 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఆర్థిక సంవత్సరం చివరి రెండు రోజుల పాటు దాదాపు 500 రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయని అధికారులు అంచనా వేశారు. అయినా అంచనాలు తారుమారు అయ్యాయి.

తుమ్మికాపల్లిలో హెచ్చరిక బోర్డులు

కొత్తవలస, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో దేవాదాయ శాఖ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది. తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన సర్వే నెంబరు 63-1 లో ఒక ఎకరా 91 సెంట్లు విస్తీర్ణం కలిగిన భూమి తుమ్మికాపల్లిలోని వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందినదని ఈ భూమిని ఎవరైనా ఆక్రమణలు చేస్తే దేవదాయ చట్టం ప్రకారం శిక్షార్హులని బోర్డులను ఏర్పాటు చేయడంతో గ్రామంలో కలకలం రేగింది. ఈ బోర్డులను తుమ్మికాపల్లి గ్రామం నుంచి దేవరాపల్లి రోడ్డుకు దక్షిణం వైపు రోడ్డుపక్కనే అక్కడక్కడ పెట్టారు. దీంతో దేవాదాయ శాఖ హెచ్చరిక బోర్డులు పెట్టిన స్థలాలన్ని ఇప్పటికే ఆక్రమణలకు గురై పక్కా భవనాలను సైతం ఆక్రమణదారులు నిర్మాణాలు చేసుకుని నివాసాలు ఉంటున్నారు. దీంతో ఆక్రమణదారులపై దేవదాయశాఖ ఇప్పుడు ఎటువంటి చర్యలు తీసుకుంటుందనే విషయమై గ్రామంలో చర్చలు జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ ఆక్రమణ దారులకు నోటీసు ఇస్తే కోర్టులను ఆశ్రయించాలని ఇప్పటి నుంచే న్యాయ సలహాలు తీసుకుంటున్నారు.

కల్వర్టులు ఛిద్రం..

- అస్తవ్యస్తంగా బొబ్బిలిలోని డ్రైనేజీ వ్యవస్థ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు

రహదారులు అధ్వానం



ఇదీ మంగలవీధిలో కల్వర్టు పరిస్థితి



పూల్‌బాగ్ రోడ్డులో పొంగిపొర్లుతున్న మురుగు

బొబ్బిలి మార్చి 31(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పలు వార్డులలో మునిసిపల్ డ్రైనేజీలపై గల కల్వర్టులు ఛిద్రమయ్యాయి. రాత్రి వేళల్లో వీధి దీపాలు లేని సమయాల్లో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాకీ వీధి, కోరాడ వీధులలో పాఠశాలల విద్యార్థులు ఈ కల్వర్టుల దగ్గర తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే బజారు సెంటరును ఆనుకుని ఉన్న మంగల వీధిలో కల్వర్టు చాలా అధ్వానంగా తయారైంది. కల్వర్టును దాటడానికి సాహసాలు చేయాల్సి వస్తోంది. అగురు వీధిలో కల్వర్టుకు సరిగ్గా మధ్యలో ఓ పెద్ద రంధ్రం ఏర్పడింది. పూల్‌బాగ్ ప్రాంతంలో రోడ్డు, డ్రైనేజీ చాలా దారుణంగా తయారయ్యింది. బొబ్బిలి-తెర్లాం రోడ్డు మార్గం కావడంతో పెద్దసంఖ్యలో అనేక వాహనాలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. మురుగునీరంతా డ్రైనేజీల్లో పెద్దఎత్తున పేరుకుపోవడమే కాక, రహదారి పైకి ప్రవహిస్తోంది. రోడ్డంతా మురికికూపంగా మారడంతో జనం మండి పడుతున్నారు. ప్రధాన రహదారిలో దుస్థితి ఇలా ఉంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అలాగే నాయుడు కాలనీలో పలు కల్వర్టులపై పలకలను పేర్చి వదిలేశారు. వీటిపై రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం

అగురు వీధిలో కల్వర్టును బాగు చేయాలని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, అంచనాలు తయారు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఐదో వార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి తెలిపారు.

కల్వర్టులను బాగు చేస్తాం

పట్టణంలో వార్డు పర్యటనకు వెళ్లినప్పుడు పాడైన కల్వర్టులన్నిటినీ పరిశీలించాం. వీటి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు తయారు చేశాం. ఎన్నికల కోడ్, ఇతర సాంకేతిక కారణాలతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు జరగలేదు. పాడైన కల్వర్టులన్నిటినీ బాగు చేయిస్తాం. ప్రమాదకరంగా ఉన్న వాటిని యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని ఇంజనీర్లను ఆదేశించాం.

- రామలక్ష్మి, మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి

డోలీ మోతలు లేకుండా చేయడమే లక్ష్యం

- మంత్రి సంధ్యారాణి



తారురోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.కోటీ 25 లక్షలతో పడాలవలస నుంచి సిమిడి వలస వరకు (వయా కొత్తూరు) నిర్మించిన తారు రోడ్డును ఆమె సోమవారం ప్రారంభించారు. ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. థింసా, కోలాటం నృత్యాలతో గిరిజనులు ఆహ్వానించారు. అనంతరం సిమిడివలసలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి గిరిజన గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టి డోలీ మోతలు లేని గ్రామాలను చూడటమే ఈ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. గిరి శిఖర గ్రామాల రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు రూ.500 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే సాలూరు నియోజకవర్గంలో సుమారు రూ.83 కోట్లతో రహదారుల నిర్మాణం జరుగుతుందని అన్నారు. గిరిశిఖర గ్రామాల్లో ఉన్న తన అక్క చెల్లెమ్మలు ఇబ్బందులు పడితే సహించలేనని అన్నారు. మండలంలో మరో మూడు రోడ్లు కురుకూట్టి నుంచి సంపంగిపాడు, కొదమ నుంచి బందపాయి-చింతామల రోడ్డు, తాడిలోవ నుంచి మారయ్యపాడుకు రోడ్లు నిర్మాణానికి రూ.30కోట్లతో నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టుచెన్నారు, పగులుచెన్నారు, తోణాం గ్రామాలకు చెందిన సుమారు 250 కుటుంబాలకు చెందిన ప్రజలు, నాయకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిని కండువాలతో మంత్రి సాదారంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పరమేష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ, రొంపల్లి వెంకటేష్, అప్పికొండ రమాదేవి, శ్యామ్, యుగంధర్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను పట్టుకోవాలని ఆదేశించాం

సాలూరు మండలం కందులపథం పంచాయతీ మర్రివానివలస గ్రామానికి చెందిన వాటిక ఐశ్వర్య అనుమానాస్పద మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, బాధ్యులను కోర్టు ముందు ఉంచాలని ఆ శాఖకు ఆదేశాలు ఇచ్చామని మంత్రి తెలిపారు. 24 గంటల్లోనే కేసును ఛేదించి, నిందితులను పట్టుకున్నందుకు ఆమె పోలీసు అధికారులను అభినందించారు.



కోదండరామస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న దృశ్యం



ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

తోటపల్లిలో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వసంత నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఈ పూజలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గత నెల 30న ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించను న్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. శ్రీరామ సుప్రభాత సేవ, ఆరాధన, మంగళాశాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీరామద్రా మాయణ పారాయణాలు నిర్వహించారు. ఈ నెల 6న శ్రీసీతారామస్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు వీవీ అప్పలాచార్యులు తెలిపారు. సీతారాముల వారి కల్యాణానికి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

రంజాన్ పండుగను ఉమ్మడి జిల్లాలోని ముస్లింలంతా సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పరస్పరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



కురుపాం: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల



గజపతినగరం: సంతతోట ఆవరణలో..



బొబ్బిలి: మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రామభద్రపురం: రంజాన్ తోఫా అందజేస్తున్న కూటమి నాయకులు



వీరఘట్టం: జామియా మసీదులో ప్రార్థనలు



కొత్తవలస: హైస్కూల్ మైదానంలో..



ఎస్.కోట రూరల్: జామిలో..



చీపురుపల్లి: స్వీట్లు అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

మసీదుల వద్ద బందోబస్తు

- డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ

విజయనగరం క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సోమవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఎటువంటి మత విద్వేషాలు, ఘర్షణలు, అల్లర్లు జరగకుండా ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ చేపట్టిన ముందస్తు భద్రతా చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. నగరంలోని ప్రధాన మసీదుల వద్ద డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరుల వాహనాలు వల్ల ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారన్నారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యరెడ్డి, రాఘవులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారని ఎస్పీ పేర్కొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

బొబ్బిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం 27 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలరు జేసీ రాజు, ఏపీటీఎఫ్ నాయకుడు బంకురు జోగినాయుడు కోరారు. సోమవారం వారు బొబ్బిలిలో మాట్లాడారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ, సీపీఎస్ బకాయిల చెల్లింపులపై చర్యలు తీసుకోవడం హర్షణీయం అన్నారు. 12వ వేతన సంఘాన్ని కూడా ప్రకటించి, ఉద్యోగ వర్గాలకు మేలు చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన కరవు భత్యం, పింఛన్‌దారులకు రావాల్సిన కరవు సవరణ భత్యం, పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. విద్యా సంస్కరణలో భాగంగా ప్రాథమిక పాఠశాలలను కొనసాగించి వాటిలో కనీసం మూడు స్కూలు అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గొర్లెసీతారాంపురంలో సీఐ పల్లెనిద్ర

బొబ్బిలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ సోమవారం పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన సైబర్ క్రైం, రహదారి భద్రత, దొంగతనాలు, మాదక ద్రవ్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలి

గరుగుబిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు అసౌకర్యం కలగకుండా పింఛన్ మొత్తాలను అందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. సోమవారం ఆమె స్థానిక సచివాలయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. 13 సచివాలయాల పరిధిలోని 8,022 మందికి మార్చి నెలకు సంబంధించి పింఛన్ మొత్తాలు మంజూరయ్యాయని చెప్పారు. వేసవి దృష్ట్యా వృద్ధులకు, దివ్యాంగులకు నిర్దేశించిన సమయానికి పింఛన్లు అందించాలన్నారు. పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం నూతనంగా ఎల్1 స్కానర్లను మంజూరు చేసిందని తెలిపారు. పింఛన్ల పంపిణీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యాన్ని, మానసిక వికాసాన్ని పొందవచ్చని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గల యోగా విద్యా కేంద్రంలో యోగా విద్యను అభ్యసించిన 35 మందికి సోమవారం ఆయన ఆంధ్రా యూనివర్శిటీ యోగా డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. అలాగే కేంద్ర నిర్వాహకులు, యోగా శిక్షకులు ప్రసాద్, సత్యంలను అభ్యాసకులు సత్కరించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు ఆదేశాల మేరకు సోమవారం పలు పంచాయతీల్లోని కాలువల్లో పూడికలు తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టారు. అలాగే తాగునీటి వనరుల ప్రాంతాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

గరుగుబిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రమాదాల నుంచి బయటపడాలంటే విధిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్ఐ రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ప్రాణ రక్షణగా నిలు స్తుందన్నారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినట్లయితే సమాచారం అందించాలన్నారు.

రేపు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

గరుగుబిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల విస్తృత స్థాయి సమావేశం ఈనెల 2న గరుగుబిల్లిలో నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు ఎ.మధుసూదనరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరవుతున్నారని చెప్పారు. పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మావుడి పరిధిలో ఉన్న 11 కేవీ చింతలవలస ఫీడర్‌పైన ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఈపీడీసీఎల్ పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.గోపాలరావునాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. త్రీఫేజ్ సప్లయి మాత్రం ఉదయం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఉంటుందన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు..

పాలకొండ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకంపేట వాటర్ ట్యాంక్‌కు సంబంధించి భాష్యం స్కూల్ ఎదురుగా ఉన్న లేఅవుట్ వద్ద ఉన్న పంపింగ్ పైపులైన్ పాడయ్యింది. ప్రస్తుతం బాగు చేస్తున్నందున ట్యాంకు పరిధిలోని 1, 2, 11, 12, 17, 18, 19, 20 వార్డులకు ఈనెల 1, 2 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర పంచాయతీ కమిషనర్ జయరాం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పైపులైన్ బాగైన వెంటనే నీటి సరఫరా జరుగుతుందన్నారు. అంతవరకు వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

శ్యామలాంబ పండగ కరపత్రం విడుదల

సాలూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాలూరు గ్రామదేవత శ్యామలాంబ అమ్మవారి పండగకు సంబంధించి ఉత్సవ కమిటీ కరపత్రాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం సాలూరులో విడుదల చేశారు. పండగకు సంబంధించిన విషయాలను కరపత్రంలో ముద్రించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్కేన అప్పారావు, నిమ్మాది తిరుపతిరావు (చిట్టి) తదితరులు పాల్గొన్నారు.

నర్సుపల్లికి ఎమ్మెల్యే అభినందన

బొబ్బిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియ మితులైన టీడీపీ తెర్లాం మండల అధ్యక్షుడు నర్సుపల్లి వెంకటనాయుడును ఎమ్మెల్యే బేబీ నాయన అభినందించారు. సోమవారం బొబ్బిలి కోటకు వచ్చిన నర్సుపల్లిని ఆయన అభినందించారు. అలాగే బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడును తన కార్యాలయంలో నర్సుపల్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనను తెంటు సత్కరించారు.

వంశపారంపర్య వ్యాధులపై సర్వే

రామభద్రపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఏఎన్ఎం మహాలక్ష్మి ఆధ్వర్యంలో వంశపారంపర్య వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొబ్బిలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వెంకటరాయుడి పేట ఎంపీపీ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంపై గత నెల 7న ఆంధ్రజ్యోతిలో 'ఇరుకు గదిలో.. నేలపైన' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మింపజేశారు.